సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం, 6, ఫిబ్రవరి, 2025



చీనీ టన్ను రూ.21,200

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.21,200, కనిష్టంగా రూ.4,200, సరాసరిన రూ.11 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం

35.8°/11.7°

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం ఎండవేడి అధికమైంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

హెచ్‌ఎం నాగేశ్వరరావు సస్పెన్షన్

పుట్టపర్తి: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు సస్పెండ్ అయ్యారు. గోరంట్లలోని ఓ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగేశ్వరరావు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తుండగా, మంగళవారం విద్యార్థినులు తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎం నాగేశ్వరరావును దండించడంతో పాటు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు హెచ్‌ఎం నాగేశ్వరరావుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం డీఈఓ కృష్ణప్ప హెచ్‌ఎం నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం



పుట్టపర్తి: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి. బుధవారం ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘునాథరెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 594 మందికి గాను 549 మంది హాజరయ్యారని, మరో 45 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. అలాగే ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 482 మందికి గాను 470 మంది హాజరయ్యారని, 12 మంది గైర్హాజరయ్యారన్నారు. స్పెషల్ ఆఫీసర్ చెన్నకేశ ప్రసాద్, పరీక్షల కమిటీ సభ్యులు సురేష్‌బాబు, శ్రీరామరాజు, శ్రీనివాసరెడ్డి ప్రాక్టికల్స్‌ను పర్యవేక్షించారని వెల్లడించారు.

అక్రమాలను సహించం

- రేషన్ పంపిణీ, 'దీపం–2' పక్కాగా అమలు చేయాలి
- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



సమీక్షిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీ, దీపం –2 పథకం అమలులో అక్రమాలు జరిగినట్లు తేలితే సంబంధిత అధికారులు, డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, జిల్లా మేనేజర్‌తో పాటు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఎండీయూ వాహనాలు, రేషన్ డీలర్ల ద్వారా పంపిణీ చేసే నిత్యావసర సరుకుల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చూడాలన్నారు. 'దీపం -2' పథకం ద్వారా లబ్ధిదారులకు సకాలంలో సబ్సిడీ సొమ్ము జమ కావాలన్నారు. అలాగే అర్హులందరికీ లబ్ధి చేకూరేలా గ్యాస్ ఏజెన్సీ డీలర్లు వ్యవహరించాలన్నారు. అక్రమాలపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే డీలర్‌షిప్ రద్దు చేస్తామన్నారు.

మీట నొక్కితే సేవలు



హిందూపురానికి చెందిన రమేష్.. ఉన్నట్టుండి అనంతపురం బయలుదేరాడు. బస్సు ఎక్కాక చూసుకుంటే జేబులో డబ్బు లేదు. జేబులో ఏటీఎం కార్డు కూడా లేదు. కానీ కండక్టర్ చేతిలోని మిషన్‌లోని క్యూఆర్ కోడ్‌స్కాన్ చేసి ఫోన్ పే ద్వారా డబ్బుచెల్లించి టికెట్ తీసుకోవచ్చని తెలిసి ఆ మేరకు తన స్మార్ట్ ఫోన్‌తో టికెట్ కొన్నాడు. ఇతరుల వద్ద చేయి చాచకుండా పని జరిగిందని సంబరపడ్డాడు.



పుట్టపర్తికి చెందిన సాయి కారులో బెంగళూరు వెళ్తుండగా.. గోరంట్ల దాటిన తర్వాత కారు ఆగిపోయింది. వెంటనే గూగుల్‌లో సెర్చ్ చేసి మెకానిక్ నంబరు వెతికాడు. ఓ నంబర్‌కు కాల్ చేసి మాట్లాడాడు. అరగంటలో సమస్య పరిష్కారమైంది. వీడియో కాల్ ద్వారా చిన్న చిన్న పనులు చేసుకుని.. ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించినట్లు వివరించాడు.



కొత్తచెరువుకు చెందిన గంగయ్య విజయవాడకు వెళ్లి ఉన్నఫళంగా అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరాడు. వెంటనే అక్కడకు వెళ్లిన బంధువులు... ఆయనకు రక్తం ఎక్కించాల్సిరావడంతో తెలిసిన వారి ద్వారా రక్త దాతల వాట్సాప్ గ్రూపులో సంప్రదించారు. అరగంటలో రక్తదాత దొరికాడు. విజయవంతంగా ఆపరేషన్ జరిగింది.

..ఇలా ఏ పనైనా మీట నొక్కితే జరిగిపోతోంది. స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే చాలు..పనులన్నీ జరిగిపోతున్నాయి. ఫలితంగా జిల్లా వాసులు కూడా 'డిజిటల్' బాట పట్టారు. అందుకే లావాదేవీల్లో యూపీఐ పేమెంట్‌లు అగ్రస్థానంలో నిలుస్తున్నాయి.

- ఆన్‌లైన్‌లోనే ఏ టు జెడ్ సర్వీసులు
- అందరి చేతిలో స్మార్ట్‌ఫోన్.. అంతా డిజిటల్ మయం
- సులువుగా, వేగంగా అందుతున్న సేవలు
- విస్తృతంగా వినియోగిస్తోన్న జిల్లా ప్రజలు

సాక్షి, పుట్టపర్తి జేబులో డబ్బులు ఉండక్కర్లేదు.. బస్సులో టికెటుకు సరిపడా చిల్లర అవసరం లేదు. రైలు ఎక్కాలంటే టికెట్ కొనేందుకు క్యూలో నిలవాల్సిన పని లేదు. ఫుడ్ కావాలంటే హోటల్ వరకూ వెళ్లాల్సిన పనిలేదు. స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే చాలు కావాల్సినవన్నీ ఇంటి తలుపు తడుతున్నాయి. ఫలితంగా చదువు రాని వారు కూడా ఆన్‌లైన్ సర్వీసులను మొబైల్ ద్వారా వినియోగిస్తున్నారు. ఇన్నాళ్లూ ప్రధాన నగరాలకే పరిమితమైన సర్వీసులు సైతం పల్లెలకు వ్యాపించాయి. ఫలితంగా ప్రతి ఒక్కరూ డిజిటల్ విధానాన్నే ఇష్టపడుతున్నారు. పండుగల సమయాల్లో షాపింగ్‌లు కూడా ఆన్‌లైన్‌లోనే జరిగిపోతున్నాయి.

పెరిగిన డిజిటల్ వాడకం

జిల్లా వ్యాప్తంగా మారుమూల పల్లె నుంచి పట్టణాల వరకు డిజిటల్ వాడకం పెరిగిపోయింది. ఆఖరికి టీ తాగినా ఫోన్ పే ద్వారా డబ్బు చెల్లించే స్థాయికి చేరింది. చిల్లర సమస్య తలెత్తకపోవడంతో ఆటో డ్రైవర్లు, టీ స్టాల్ నిర్వాహకులు, తోపుడు బండ్లలోనూ ఆన్‌లైన్ పేమెంట్‌లకే జైకొడుతున్నారు.



27 లక్షలు
జిల్లా జనాభా

18.9 లక్షలు
జిల్లా పరిధిలోని సిమ్ కార్డులు

6.3 లక్షలు
జిల్లా వాసులు వాడుతున్న స్మార్ట్ ఫోన్లు

రూ.50 లక్షలపైగా
రోజుకు నగదు లావాదేవీలు

రూ.40 లక్షల వరకు
డిజిటల్ లావాదేవీలు

సమయం విలువైందంటూ..

సమయం చాలా విలువైనదని అందరూ చెబుతుంటారు. డిజిటల్ లావాదేవీలు, ఆన్‌లైన్ సర్వీసుల ద్వారా సమయం ఆదా అవుతోందని ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. 99 శాతం మంది ఆన్‌లైన్ లావాదేవీలకే మొగ్గు చూపుతున్నారు. సామాన్యులు కూడా ఇంటి వద్ద నుంచి సేవలు పొందడంతో పాటు బస్సులు, రైళ్లలో ప్రయాణించే సమయంలో ఆన్‌లైన్ ద్వారానే నగదు లావాదేవీలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. కాలంతో పాటు రవాణా వ్యయం కూడా ఆదా అవుతోందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులోకి లెక్కలేనన్ని యాప్‌లు

ఫోన్‌పే, గూగుల్ పే, అమెజాన్ పే, పేటీఎం, ఫ్యామ్‌పే, ఐఆర్‌సీటీసీ, యూటీఎస్, ఏపీఎస్‌ఆర్టీసీ, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, డిజిలాకర్, వేర్ ఈజ్ మై ట్రెయిన్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఏజియో, బ్యాంకు లావాదేవీల యాప్‌లు, యూట్యూబ్ తదితర యాప్‌లు, బ్రౌజింగ్ ద్వారా డిజిటల్ సేవలను ప్రజలు పొందుతున్నారు. అవసరాలకు అనుగుణంగా ఫోన్‌లో మొబైల్ నంబరు ఆధారంగా లాగిన్ రిజిస్ట్రేషన్ చేసుకుని.. నిమిషాల వ్యవధిలో సేవలు పొందుతున్నారు.

నిమిషాల్లో లావాదేవీలు



స్మార్ట్ ఫోన్ ద్వారా ఎలాంటి లావాదేవీలైనా నిమిషాల్లో పూర్తవుతున్నాయి. వ్యాపారాల దగ్గర ఇబ్బంది లేకుండా పోయింది. ఎంతదూరం ప్రయాణించాలన్నా.. డబ్బులు వెంట తీసుకెళ్లాల్సిన పని లేదు. చేతిలో ఫోన్ ఉంటే ఎన్ని రూ.లక్షలు అయినా మోసుకెళ్లవచ్చు. దొంగల బెడద ఉండదు. ఎంతదూరం ప్రయాణించినా.. డబ్బులు తీసుకెళ్తున్నా.. జాగ్రత్తగా ఉండాలనే ఆలోచన లేకుండా పోయింది.

– కుమ్మరి నాగరాజు, సోమందేపల్లి

చెల్లింపులు పక్కాగా ఉంటాయి



డిజిటల్ వ్యాపారంతో రోజుకు ఎంత వసూలైందో.. నిమిషాల్లో లెక్క కట్టవచ్చు. ఉదయం అకౌంట్‌లో లెక్క రాసుకుంటే.. సాయంత్రం ఎంత యాడ్ అయిందో తెలిసిపోతుంది. చెల్లింపులు పక్కాగా ఉంటాయి. చిల్లర సమస్య ఉండదు. కస్టమర్లతో ఇబ్బంది ఉండదు. జనం కూడా డిజిటల్ లావాదేవీలకే మొగ్గు చూపుతున్నారు.

– మహేశ్‌బాబు, టీస్టాల్ నిర్వాహకుడు, కొడికొండ చెక్‌పోస్టు

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు రాయలసీమ జిల్లాల మీదుగా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 14న తిరుపతి జంక్షన్‌లో రాత్రి 11.45 గంటలకు బయలుదేరే రైలు(నంబర్ 07117).. రెండు రోజుల తరువాత దానాపూర్ రైల్వేస్టేషన్‌కు రాత్రి 11.55 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి ఈ రైలు (07118) అక్కడి నుంచి 17వ తేదీ మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి రెండు రోజుల తరువాత తిరుపతి జంక్షన్‌కు మధ్యాహ్నం 1.45 గంటలకు చేరుతుందన్నారు. రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, డోన్, కర్నూలు, గద్వాల్, వనపర్తిరోడ్డు, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, ఉందానగర్, కాచిగూడ, మాల్కజ్‌గిరి, చర్లోపల్లి, ఖాజీపేట మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు.

- అదేవిధంగా తిరుపతి–దానాపూర్ మార్గంలో మరో ప్రత్యేక రైలు (07119) ఈ నెల 18న నడుస్తుందన్నారు. ఆ రోజు రాత్రి 11.45 గంటలకు తిరుపతి జంక్షన్ నుంచి బయలుదేరి రెండు రోజులు తరువాత దానాపూర్ రైల్వేస్టేషన్ రాత్రి 11.55 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి (07120) అక్కడి నుంచి ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి రెండు రోజుల తరువాత మధ్యాహ్నం 1.45 గంటలకు తిరుపతి జంక్షన్ చేరుకుంటుందన్నారు. రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయాచూర్, కృష్ణ, యాద్గిరి, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట, సికింద్రాబాద్, చర్లోపల్లి, ఖాజీపేట మీదుగా రాకపోకలు సాగిస్తుందన్నారు. ఈ రైళ్లకు టూటైర్ ఏసీ, త్రీ టైర్ ఏసీ, స్లీపర్ కోచ్‌లతోపాటు జనరల్ బోగీలు ఉంటాయన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆరోగ్యశ్రీ పేరుతో టోకరా

- మహిళకు సైబర్ నేరగాళ్ల వల
- లింక్ పంపి విడతల వారీగా రూ.లక్షకుపైగా స్వాహా

చెన్నేకొత్తపల్లి: ఆరోగ్యశ్రీ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఓ మహిళను నమ్మించిన సైబర్ నేరగాడు విడతల వారీగా ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.లక్షకు పైగా నగదు మాయం చేశాడు. ఈ ఘటన చెన్నేకొత్తపల్లిలో బుధవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. చెన్నేకొత్తపల్లి మండలం ఓబులంపల్లి గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి కుమార్తె త్రిలోకపావనికి ఈనెల 2వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో ఓ కొత్త నంబర్ నుంచి కాల్ వచ్చింది. కాల్ లిఫ్ట్ చేయగానే అవతలి వైపు నుంచి తాను ఆరోగ్యశ్రీ కాల్ సెంటర్ నుంచి మాట్లాడుతున్నానని అపరిచితుడు పరిచయం చేసుకున్నాడు. అనంతరం రెండేళ్ల క్రితం మీ తండ్రి శస్త్ర చికిత్స చేయించుకున్నాడని, అందుకు సంబంధించి ప్రభుత్వం రూ.40 వేలు మంజూరు చేసిందని తెలిపాడు. అయితే బ్యాంకు ఖాతా సమస్య కారణంగా ఆ మొత్తం ఖాతాలో జమ చేయడం కుదరడం లేదని నమ్మబలికాడు. ప్రస్తుతం తాను ఖాతాను సవరిస్తున్నానని, ఇందుకోసం మీకు ఒక లింక్ పంపుతానని, దాన్ని ఓపెన్ చేయాలని సూచించాడు.



అపరిచితుడి మాటలు నమ్మిన త్రిలోకపావని తన సెల్‌ఫోన్‌కు వచ్చిన లింక్‌ను ఓపెన్‌చేసింది. పిన్ ఎంటర్ చేయాలని సూచించగా, ఆ మేరకు పిన్ ఎంటర్ చేసింది. దీంతో వెంటనే ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.47 వేలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో ఆందోళన చెందిన త్రిలోకపావని ఇదే విషయాన్ని అపరిచితుడికి తెలపడంతో ఆన్‌లైన్ సమస్య వల్ల అలా జరిగిందని, తాజాగా మరోసారి లింక్ పంపుతానని... దాన్ని ఓపెన్ చేస్తే ఇప్పటికే కట్ అయిన మొత్తంతో పాటు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.40 వేలు కలిపి రూ.87 వేలు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని నమ్మబలికాడు. దీంతో త్రిలోకపావని మరోసారి తన సెల్‌కు పంపిన లింక్ ఓపెన్ చేసి ఓటీపీ ఎంటర్ చేయగానే ఖాతాలోని మరో రూ.40 వేలు విత్‌డ్రా అయింది. ఇలా మరోసారి చేయగా ఖాతాలో మిగిలి ఉన్న రూ.17,700 విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. ఆ తర్వాత ఫోన్ కాల్ కట్ కాగా, మెసేజ్‌లు చదువుకున్న త్రిలోకపావని తనకు వచ్చిన నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో తాను మోసపోయానని భావించి ఆమె వెంటనే 1903 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. 1903 కాల్ సెంటర్ నుంచి ఫిర్యాదు ఎస్పీ కార్యాలయానికి రాగా, పోలీసులు త్రిలోకపావనికి ఫోన్ చేసి స్థానిక పోలీసు స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో ఆమె మంగళవారం రాత్రి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. అపరిచిత వ్యక్తులు లింక్‌లు నొక్కమని చెప్పినా, ఓటీపీ అడిగినా చెప్పవద్దని ఎస్ఐ సత్యనారాయణ సూచించారు.

చేనేతకు పూర్వ వైభవం తెస్తాం

- చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

హిందూపురం: చేనేత, జౌళి రంగాలకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. బుధవారం ఆమె హిందూపురంలో చేనేత, జౌళి శిక్షణ కేంద్రాన్ని పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్థానిక యువతకు చేనేత, జౌళి రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. చేనేత కార్మికుల కోసం వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారిని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే పింఛన్ పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాలు అమలు చేస్తున్నామని, త్వరలో తల్లికి వందనం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యంతోపాటు అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేస్తామన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించడంలో భాగంగా కుట్టు శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టుమిషన్లు కూడా అందిస్తున్నామన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. మంత్రి వెంట చేనేత, జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు, జిల్లా ఏడీ రామకృష్ణ, డీఎస్‌డీఓ హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్ ఉన్నారు.



శిక్షణ కేంద్రాన్ని పునఃప్రారంభిస్తున్న మంత్రి సవిత

ఉద్యాన రైతుల తలరాతలు మారుస్తాం

- 'అనంత హార్టికల్చర్ కాంక్లేవ్'లో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



హార్టికల్చర్ కాంక్లేవ్‌లో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్



లోనికి అనుమతించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉద్యాన రైతులు

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యాన రైతుల తలరాతలు మార్చుతామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంవైఆర్ కన్వెన్షన్ హాలులో 'అనంత హార్టికల్చర్ కాంక్లేవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ వినోద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మెంటర్‌గా స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, అలాగే ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సీఈఓ గెడ్డం శేఖర్‌బాబు హాజరు కాగా... ముఖ్య అతిథిగా మంత్రి పయ్యావుల హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధరలను స్థిరీకరించి రైతులను ఆర్థికంగా గట్టెక్కించే బాధ్యత తీసుకుంటామన్నారు. 'అనంత' బ్రాండ్‌ను క్రియేట్ చేసి ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియాగా మారుస్తామన్నారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రానున్న కాలంలో 'అనంత' ఫలసాయం బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ కాకుండా అంతర్జాతీయ స్థాయి మార్కెట్లకు అనుసంధానించి రైతులు ఆర్థికంగా గట్టెక్కేలా కృషి చేస్తామన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఐఆర్‌టీఎస్ ప్రతినిధి అనితాబారుక్ తమ సందేశాలను వీడియో ద్వారా వినిపించారు.

ఏడు ఎంఓయూలు..

కాంక్లేవ్‌కు వివిధ రాష్ట్రాల నుంచి 64 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరైనట్లు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ప్రస్తుతానికి ఏడు కంపెనీలతో ఎంఓయూలు కూడా చేసుకుంటున్నట్లు తెలిపారు. నాలుగేళ్ల యాక్షన్ ప్లాన్ కింద ఉద్యాన తోటలను 10 వేల హెక్టార్లు పెంచడం, సూక్ష్మసాగు కింద 25 వేల హెక్టార్లకు డ్రిప్ అందివ్వడం, 29 లక్షల మెట్రిక్ టన్నులకు దిగుబడి పెంచడం, పంట తొలగింపు తర్వాత నష్టాలు 10 శాతం తగ్గిస్తూ రూ.800 కోట్ల మేర ఏటా రైతులు లాభం పొందేలా చేయడమే కర్తవ్యమన్నారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సీఈఓ శేఖర్‌బాబు మాట్లాడుతూ ఉద్యాన ఉత్పత్తుల విలువ ఆధారిత పెంపులో భాగంగా కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. అనంతరం రైతులకు సేవలందించిన ఎన్‌జీఓలు, ఉత్తమ రైతులు మొత్తం 11 మందికి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరామ్, అమిలినేని సురేంద్రబాబు, పరిటాల సునీత, బండారు శ్రావణి, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, అడిషనల్ డైరెక్టర్లు ఎం.వెంకటేశ్వర్లు, సీహెచ్ హరినాథరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు అవమానం

అనంత హార్టికల్చర్ కాంక్లేవ్‌కి అసలు సిసలైన పండ్లతోటల రైతులను రానివ్వకుండా అడ్డుకుని అవమానపరిచారు. ఉద్యాన సమ్మేళనానికి దారి పొడవునా, ప్రధాన ద్వారం రెండు వైపులా పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. గుర్తింపు కార్డు లేనిదే లోపలికి ప్రవేశం లేదని పోలీసులు తెగేసి చెప్పడంతో రైతులు మూకుమ్మడిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. పండ్లు, కూరగాయల పంటలు పండించే తమనే అవమానానికి గురి చేస్తారా అంటూ మండిపడ్డారు. అయినా పోలీసులు లోపలికి పంపడానికి నిరాకరించడంతో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారుల వైఖరిపై తీవ్రస్థాయి ఆగ్రహం వెలిబుచ్చారు. ఇంత మాత్రానికి వారం రోజులుగా పెద్ద ఎత్తున ఎందుకు ప్రచారం చేశారని, ఎవరి ప్రయోజనాలు కాపాడేందుకని గద్దించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ అక్కడికి వచ్చి రైతులను శాంతింపజేసి లోపలికి అనుమతించారు. అప్పటికే తీవ్ర ఆగ్రహంతో ఉన్న రైతులు అయిష్టంగానే హాజరయ్యారు.

క్లుప్తంగా

పారా లీగల్ వలంటీర్ల సేవలు అమోఘం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

అనంతపురం: న్యాయ సేవాప్రాధికార సంస్థకు, బాధితులకు వారధిగా ఉంటూ సరైన న్యాయాన్ని సరైన సమయంలో అందేలా పారా లీగల్ వలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో పారా లీగల్ వలంటీర్ల శిక్షణా తరగతులను బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. పారా లీగల్ వలంటీర్లు నిర్వర్తించాల్సిన బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాప్రాధికార సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్ యాదవ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, న్యాయవాదులు పద్మజ, హరికృష్ణ, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇటికె నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం డంప్ స్వాధీనం



గుంతకల్లు రూరల్: స్థానిక పారిశ్రామిక వాడలోని బహిరంగ ప్రదేశంలో డంప్ చేసిన 56 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు రేషన్ బియ్యాన్ని డంప్ చేసినట్లుగా స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తం చేయడంతో గుంతకల్లు రూరల్ పోలీసులతో కలసి బుధవారం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టామన్నారు. 56.20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేసిన అనంతరం సివిల్ సప్లయిస్ గోదాముకు తరలించామన్నారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని డంప్ చేసిన వ్యక్తులెవరో అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారన్నారు.

లారీ దగ్ధం

కుందుర్పి: బరువైన గ్రానైట్‌ను తరలిస్తున్న లారీ ప్రమాదవశాత్తు చెలరేగిన మంటల్లో పూర్తిగా కాలిపోయింది. కుందుర్పి మండలం మలయనూరు ప్రధాన రహదారిపై బుధవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. తాడిపత్రికి చెందిన ఓ లారీ కర్ణాటకలోని చిత్రదుర్గం నుంచి గ్రానైట్ తీసుకుని అనంతపురం వైపుగా వెళుతుండగా రోడ్డుపై నూర్పిడి చేసేందుకు వేసిన ఉలవ కట్టె ఇంజన్‌కు తగిలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన డ్రైవర్ మంటలు ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కళ్యాణదుర్గం నుంచి ఫైర్ ఇంజన్ వచ్చేలోపు లారీ పూర్తిగా కాలిపోయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



ఉట్లమాను అధిరోహించడానికి పోటీ పడుతున్న యువకులు

ఉత్సాహంగా.. ఉట్లమాను జాతర

గుడిబండ: మండలంలోని హిరేతుర్పిలో ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు మూడురోజుల పాటు వైభవంగా జరిగాయి. చివరిరోజు బుధవారం ఉదయమే అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన ఉట్లమాను జాతరలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉట్లమాను అధిరోహించడానికి భారీగా పోటీపడ్డారు. పైనుంచి బంకమట్టి పోస్తుండగా... ఉట్లమాను ఎక్కేందుకు యువత శత విధాలా ప్రయత్నించారు. కిందపడుతూ, తిరిగి ఉట్లమాను ఎక్కేందుకు ప్రయత్నిస్తూ అందరికీ ఆహ్లాదం పంచారు. వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైద్యుడి నిర్లక్ష్యం.. చిన్నారి మృతి



కరుణాకర్ (ఫైల్)



సుధా క్లినిక్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

పావగడ: ప్రైవేట్ వైద్యుడి కాసుల కక్కుర్తి ఓ చిన్నారి ప్రాణాలను బలిగొంది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... పావగడలోని బాబయ్య గుడి వీధిలో నివాసముంటున్న కుమార్, శశికళ దంపతుల ఏడేళ్ల వయసున్న కుమారుడు కరుణాకర్‌కు వారం రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానిక సుధా క్లినిక్‌కు పిలుచుకెళ్లారు. అప్పటి నుంచి క్లినిక్ నిర్వాహకుడు డాక్టర్ సుధాకరరెడ్డి పర్యవేక్షణలో బాలుడికి చికిత్స అందజేస్తున్నారు. జ్వరం తీవ్రత పెరగడంతో క్లినిక్‌లో అడ్మిట్ చేసుకున్నారు. అయినా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళతామంటూ తల్లిదండ్రులు కోరారు. అయినా డాక్టర్ నాన్చుడు ధోరణితో అలసత్వం వహించారు. ఈ క్రమంలో కరుణాకర్ డెంగీతో బాధపడుతున్నట్లుగా మూడు రోజుల క్రితం తల్లిదండ్రులకు తెలిపారు. డిశ్చార్జ్ చేయకుండా తానే చికిత్స మొదలు పెట్టారు. అయితే రోజురోజుకూ బాలుడి పరిస్థితి విషమిస్తుండడంతో తల్లిదండ్రులు గట్టిగా నిలదీయడంతో మంగళవారం డిశ్చార్జ్ చేశారు. ఈ క్రమంలో బాలుడిని తీసుకుని ఆస్పత్రికి బయటకు వచ్చేసరికి ప్రాణాలు కోల్పోయాడు. దీంతో బాధిత కుటుంబసభ్యులు, బంధువులు బుదవారం ఉదయం క్లినిక్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో డిశ్చార్జ్ చేసి ఉంటే బెంగళూరుకు తీసుకెళ్లి తమ కుమారుడిని బతికించుకునేవారమంటూ తల్లిదండ్రులు బోరున విలపించారు. కాగా, ఘటనపై డాక్టర్ సుధాకరరెడ్డి మాట్లాడుతూ.. కరుణాకర్‌కు డెంగీ అని నిర్ధారణ కాగానే విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపానన్నారు. మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళ్లడంతో వారే నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు.

నేటి నుంచి సునామ జకినీమాత ఉత్సవాలు



సునామ జకినీ మాత ఆలయం

గుత్తి: స్థానిక ఆర్‌ఎస్ రోడ్డులో వెలసిసన ఆరె కటికల ఆరాధ్య దైవం సునామ జకినీ మాత ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. భారత దేశంలోనే ఏకైక సునామ జకినీ మాత ఆలయం కావడంతో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన ఆరె కటికలు పెద్ద ఎత్తున ఉత్సవాలకు హాజరు కానున్నారు. ఈ క్రమంలో భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆలూరు లక్ష్మణరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, విశేష అలంకరణ, పూసలు చేయనున్నారు. మహా మంగళహారతి అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని ఊరేగింపు చేయనున్నారు. 7న సామూహిక కుంకుమార్చన, అయ్యప్ప దేవాలయంలో సునామ జకినీ మాతకు గంగాస్నానం, పాల కుంభాలతో ఊరేగింపు, అతిథుల ప్రసంగాలు, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించిన ఆరె కటిక విద్యార్థులకు బహుమతుల ప్రదానం, అన్నదానం ఉంటాయి.

ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు అనిల్

అనంతపురం: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఘటనలో గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామానికి చెందిన మాదిగ మల్లికార్జున అలియాస్ మల్లారెడ్డి కుమారుడు అనిల్ (27)కు రెండేళ్ల క్రితం వివాహమైంది. ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం భార్య గర్భిణి. అనంతపురంలోని గంగానగర్‌లో నివాసముంటున్న అనిల్... బళ్లారి బైపాస్‌లో ఉన్న ఓ పెయింట్స్ షాపులో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 2న ఉరవకొండకు పెయింట్స్ చేర్చి వచ్చిన అనిల్... వాహనాన్ని దుకాణం వద్ద పార్కింగ్ చేసి, అక్కడున్న తన ద్విచక్ర వాహనం తీసుకుని ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో తపోవనం సర్కిల్ వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా పడుకుని ఉన్న ఆవును ఆలస్యంగా గమనించి తప్పించే క్రమంలో సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వాహనం స్కిడ్ అయి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడున్న వారు వెంటనే క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక మంగళవారం రాత్రి అనిల్ మృతి చెందాడు. ఘటనపై నాల్గో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

17 నుంచి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ



వివరాలు వెల్లడిస్తున్న ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి

అనంతపురం: దివంగత జర్నలిస్ట్ తేజ ప్రసాద్ స్మారకంగా జర్నలిస్టు క్రికెట్ టోర్నీ ఈ నెల 17 నుంచి ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్, ప్రెస్‌క్లబ్ కమిటీ, ఏపీ జర్నలిస్ట్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరుసగా నాలుగు రోజుల పాటు మ్యాచ్‌లు ఉంటాయన్నారు. నిఖార్సైన జర్నలిస్టుగా మూడు దశాబ్దాల పాటు నిస్వార్థంగా సమాజానికి సేవ చేసిన తేజ ప్రసాద్ పేరు మీద ఈ టోర్నీ నిర్వహించాలని వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నిర్ణయించిందన్నారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లోని వర్కింగ్ జర్నలిస్టులందరూ టోర్నీలో పాల్గొనవచ్చునన్నారు. టోర్నీలో పాల్గొనే జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌తో సంబంధం లేదన్నారు. కేవలం వర్కింగ్ జర్నలిస్ట్ అయితే చాలన్నారు. ఈ నెల 9వ తేదీ లోపు ఎంట్రీలను సుభాష్‌రోడ్డులోని అంకుశం కార్యాలయంలో అందజేయాలన్నారు. సమావేశంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆజాద్, భాస్కర్‌రెడ్డి, సొసైటీ కార్యదర్శి విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏ‘మార్చి’.. డబ్బు కాజేసి!



ఏటీఎంలో దుండగుడు (టీ షర్టు వేసుకున్న వ్యక్తి) (ఇన్‌సెట్) బాధితుడు తలారి ఈరన్న

కళ్యాణదుర్గం: ఓ వృద్ధుడి ఏమార్చి నగదు అపహరించిన ఘటన కళ్యాణదుర్గం పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామానికి చెందిన తలారి ఈరన్న బుధవారం మధ్యాహ్నం డబ్బు డ్రా చేసుకునేందుకు గాంధీ చౌక్ సమీపంలోని బుట్నా బిల్డింగ్‌లో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఏటీఎం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలోనే అక్కడ ఉన్న ఓ వ్యక్తిని ఈరన్న సాయమడిగాడు. డబ్బు తీసుకునేందుకు రాదని, ఏటీఎం నుంచి డ్రా చేసి ఇవ్వాలని కోరాడు. ఈ క్రమంలోనే దుండగుడు తన వద్ద ఉన్న నకిలీ ఏటీఎం కార్డును పెట్టి డబ్బు డ్రా చేసేందుకు యత్నించాడు. ఈ క్రమంలోనే బ్యాంక్ అధికారులను ఈరన్న సంప్రదించే లోపే ఈరన్న ఏటీఎం ద్వారా అగంతకుడు రూ.10 వేలు డ్రా చేసుకుని ఉడాయించాడు. ఈ క్రమంలోనే ఈరన్న వద్ద ఉన్న కార్డును పరిశీలించిన బ్యాంకు అధికారులు అది నకిలీ ఏటీఎం అని తేల్చారు. రూ.10 వేలు డ్రా చేసుకున్నట్లు తెలిపారు. దీంతో ఆందోళనకు గురై వెంటనే కళ్యాణదుర్గం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో ఘరానా దొంగ కదలికలు

- గుర్తిస్తే ఆచూకీ తెలపాలన్న తాడిపత్రి పోలీసులు



ఇల్లూరి నాగేంద్ర

తాడిపత్రి అర్బన్: జిల్లాలో ఘరానా దొంగ కదలికలను తాడిపత్రి పోలీసులు గుర్తించారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలంటూ బుధవారం రూరల్ పీఎస్ సీఐ శివగంగాధరరెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. వివరాలు... ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడి పేరు ఇల్లూరి నాగేంద్ర అలియాస్ ఉపేంద్ర ఉరఫ్ పుల్ల బొచ్చు. వైఎస్సార్ జిల్లాలోని మూడు ప్రాంతాల్లో కొద్ది రోజులుగా ఒంటరిగా వెళుతున్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని వారిపై దాడి చేసి నగదు, బంగారం, సెల్‌ఫోన్లను అపహరించాడు. అక్కడి పోలీసుల గాలింపు తీవ్రం కావడంతో తాడిపత్రి ప్రాంతానికి చేరుకున్నట్లుగా వైఎస్సార్ జిల్లా పోలీసులు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన స్థానిక పోలీసులు నిఘా పటిష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండడమే కాకుండా నిందితుడు నాగేంద్ర కనిపిస్తే వెంటనే 94407 96863కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

‘బీ-ఫార్మసీ, ఫార్మా-డి’లో నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: జేఎన్‌టీయూఏ ఓటీపీఆర్‌ఐలో బీ-ఫార్మసీ, ఫార్మా-డిలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ ఎ.సురేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్లకు ఏపీఈఏపీసెట్ (బైపీసీ)-2024 అర్హత సాధించడంతో పాటు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు అర్హులు. స్పాట్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. పూర్తి వివరాలు www.jntua.ac.in లో తెలుసుకోవచ్చు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతుడు గంగరాజు

ముదిగుబ్బ: రైలు నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ముదిగుబ్బ మండలం రాళ్లనంతపురం గ్రామ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... గాండ్లపెంట మండలం వంకపల్లికి చెందిన గంగరాజు(38) బతుకు తెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లి కూలీ పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తన కోటా రేషన్ బియ్యం తీసుకెళ్లేందుకు ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. మంగళవారం రాత్రి ఆయన అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి ప్రయాణిస్తూ రాళ్లనంతపురం వద్దకు చేరుకోగానే ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వివాహిత బలవన్మరణం

కదిరి టౌన్: వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... నల్లమాడ మండలం వెంకటరెడ్డిపల్లికి చెందిన ఎరికల కేశవకు 11 సంవత్సరాల క్రితం తలుపుల మండలం వేపులపల్లికి చెందిన స్వాతి (32)తో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెళ్లి జరిగిన తర్వాత కొంత కాలం వరకూ వేపులపల్లిలోని కేశవ సంసారాన్ని పెట్టాడు. అనంతరం ఐదారేళ్ల క్రితం కదిరికి మకాం మార్చి అడపాల వీధిలో నివాసముంటూ కుర్చీల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. రోజు మద్యం మత్తులో ఇంటికి చేరుకుని భార్యపై అనుమానంతో వేధింపులకు గురి చేస్తూ వచ్చేవాడు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న స్వాతి బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న సీఐ నారాయణరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి తండ్రి రామక్రిష్టప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

కంబదూరు: మండల కేంద్రానికి చెందిన వడ్డే మణెమ్మ కుమారుడు అనిల్‌కుమార్(24) ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడేవాడుతున్న అనిల్‌కుమార్‌కు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు విచారణ అనంతరం బుధవారం కేసు నమోదు చేశారు.

నయవంచకుడిని బంధించిన గ్రామస్తులు



మోసగాడిని విచారిస్తున్న గ్రామస్తులు

అగళి: పాత బంగారానికి మెరుగు పడతానంటూ నమ్మించి మోసానికి పాల్పడుతున్న ఓ యువకుడిని స్థానికులు గుర్తించి బంధించారు. వివరాలు... అగళి మండలం ఇరిగేపల్లికి బుదవారం ఉదయం చేరుకున్న బిహార్‌కు చెందిన దిలీప్‌కుమార్.... తాను సంబంధీకుల కళ్ల ముందే పాత బంగారానికి మెరుగు పడతానంటూ స్థానిక మహిళలను నమ్మించాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన గంగమ్మ తన మెడలోని 35 గ్రాముల బంగారు మాంగల్యం చైన్‌ను ఇచ్చింది. మెరుగు పట్టిన తర్వాత చైన్ బరువులో తేడా రావడంతో అనుమానం వచ్చి స్థానిక బంగారు దుకాణంలో తూకం వేయించారు. 25 గ్రాములుండడంతో పది గ్రాముల బంగారాన్ని అపహరించినట్లుగా నిర్ధారించుకుని వెంటనే దిలీప్ కుమార్‌ను పట్టి బంధించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

అగ్ని ప్రమాదం

ఉరవకొండ: స్థానిక 42వ జాతీయ రహదారిపై దేవాంగ కల్యాణ మంటపం సమీపంలోటున్న గోనె సంచుల షాపు దగ్ధమైంది. బుధవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి రూ. 4 లక్షల విలువైన సంచులు, ఇతర సామగ్రి కాలిపోయినట్లు బాధితుడు కపత్రాళ్ల జాఫర్ తెలిపారు.

కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బుక్కరాయసముద్రం: కొండమీద రాయుని బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం వెంకటరమణ స్వామి దేవాలయంలో శ్రీవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో ఆశీనులను గావించి పుర వీధులలో ఊరేగించారు. మంగళ వాయిద్యాల నడుమ దేవరకొండపైకి తీసుకెళ్లారు. ఆదివారం ఉదయం దేవర కొండపై హోమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనాథ్ స్వామి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి, ఎంపీపీ సునీత, ఈఓ బాబు, జెడ్పీటీసీ నీలం భాస్కర్, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.



పుర వీధుల్లో స్వామి వారిని ఊరేగిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రశాంతి నిలయం: చైనీస్ నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతి నిలయంలో వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు చైనీస్ సంస్కృతీసంప్రదాయాలను మలేషియా నుంచి వచ్చిన భక్తులు ప్రతిబింబించారు. బుధవారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత నిర్వహించిన కార్యక్రమంలో సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ సభ్యుడు చీ ఉన్ కుంగ్ మాట్లాడారు. సాయి భక్తులు నూతన సంవత్సరంలో సన్మార్గంలో పయనిస్తూ సత్యసాయి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో చైనీయులు ఆకట్టుకున్నారు. చివరన నిర్వహించిన సంగీత కచేరీ మంత్రముగ్ధులను చేసింది.



యుద్ధ విన్యాసాలను ప్రదర్శిస్తున్న దృశ్యం



పౌరాణిక నాటికలోని ఓ సన్నివేశం